# జిల్లాలో ప్రశాంతంగా నీట్ పరీక్ష

316 మందికి 313 మంది హాజరు

పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ హరిత




జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్

మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్

సోమవారం 4 మే 2026

పేజీలు : 8




# ఎజెండా ఒక్కటే... జెండాలు వేరు



సింగరేణిలో మొదలైన ఇసిత్రమైన పరిస్థితి

సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థలో సమ్మెలు, పోరాటాలు, ధర్నాలు, రాస్తారోకోలు ఎన్నో జరిగాయి. ఆనాటి పాత రోజుల్లో ఇలాంటి వాటికి గొప్ప చరిత్ర ఉన్నది. సింగరేణిలో ఉన్న కార్మిక సంఘాలకు కూడా మరపురాని చరిత్ర కూడా ఉన్నాయి. ప్రస్తుతం సింగరేణిలో గనులు మూతపడడం, కొత్త గనులు రాకపోవడం, సింగరేణి కార్మికుల సంఖ్య 1 లక్ష 20 వేలకు పైగా నుంచి గణనీయంగా 39 వేలకు తగ్గిపోవడం దాంతో సింగరేణి పరిరక్షణ తప్పనిసరి అయింది. యువతకు ఉపాధి కల్పించాల్సిన అవసరము ప్రభుత్వంపై ఉన్నది.

## ఆదిలాబాద్ సిసిఐ పునః ప్రా రంభం పై ఎంపీ, ఎమ్మెల్యే లు స్పష్టత వెల్లడించాలి



**ఆదిలాబాద్ బ్యూరో,మే 3, (ప్రజా జ్యోతి)**

గత కొన్ని సంవత్సరాలుగా మూసి ఉన్న ఆదిలాబాద్ సి మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇం డియా (సిసిఐ) పరిశ్రమ పునః ప్రారంభం పై ఆదిలాబాద్ ఎం పీ గోడం నగేష్, ఎమ్మెల్యే పా యల్ శంకర్ స్పష్టతను ఇవ్వా లని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ అభివృద్ధి వెనకా ల అసలు రహస్యం ఏమిటి అనే అంశంపై పట్టణంలోని - మిగతా3లో

## ప్రజల ముంగిట్లోనే సేవలు

ఇక నుండి డివిజన్ స్థాయిలో 'ప్రజావాణి' కార్యక్రమాలు ప్రారంభం

జిల్లాకొత్త కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడి



# ఎజండా ఒక్కటే.. జండాలు వేరు.. సింగరేణిలో మొదలైన ఇసిత్రమైన పరిస్థితి

## సింగరేణిలో సంఘాల అనైక్యతే ప్రధాన అడ్డంకా.....?

## ఒకే సమస్యలు... వేర్వేరు పోరాటాలు

**మంచిర్యాల, 3,మే (ప్రజా జ్యోతి):** సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థలో సమ్మెలు, పోరాటాలు, ధర్నాలు, రాస్తారోకోలు ఎన్నో జరిగాయి. ఆనాటి పాత రోజుల్లో ఇలాంటి వాటికి గొప్ప చరిత్ర ఉన్నది. సింగరేణిలో ఉన్న కార్మిక సంఘాలకు కూడా మరపురాని చరిత్ర కూడా ఉన్నాయి. ప్రస్తుతం సింగరేణిలో గనులు మూతపడడం, కొత్త గనులు రాకపోవడం, సింగరేణి కార్మికుల సంఖ్య 1 లక్ష 20 వేలకు పైగా నుంచి గణనీయంగా 39 వేలకు తగ్గిపోవడం దాంతో సింగరేణి పరిరక్షణ తప్పనిసరి అయింది. యువతకు ఉపాధి కల్పించాల్సిన అవసరము ప్రభుత్వంపై ఉన్నది. కానీ సమస్యల కోసం పోరాడాల్సిన సంఘాలు ఒక ఒకే జెండా అయినా కూడా వేరువేరు జెండాలతో ముందుకుపోవడం కార్మికులకు శాపమా వరమా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం, ప్రభుత్వ బకాయిల చెల్లింపులు వంటి కీలక అంశాలపై సింగరేణిలో ఉన్న ప్రధాన కార్మిక సంఘాలు ఒకే స్వరంతో మాట్లాడుతున్నప్పటికీ, ఆ స్వరం ఒకే వేదికపై వినిపించకపోవడం వల్ల సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే కొనసాగుతున్నాయనే అభిప్రాయం కార్మిక వర్గాల్లో వ్యక్తమవుతోంది. సింగరేణిలో ప్రస్తుతం ఏఐటీయూసీ గుర్తింపు కార్మిక సంఘంగా కొనసాగుతుండగా, ఐఎన్టీయూసీ ప్రాతినిధ్య సంఘంగా ఉంది. బిఎంఎస్, సిఐటియు, హెచ్ఎంఎస్ వంటి ఇతర జాతీయ కార్మిక సంఘాలు కూడా కార్మిక సమస్యలపై తమదైన విధానంలో పోరాటాలు కొనసాగిస్తున్నాయి. అయితే అన్ని సంఘాలు చెబుతున్న సమస్యలు దాదాపు ఒకటే అయినప్పటికీ, పోరాటాలు మాత్రం విడివిడిగా సాగుతుండటం ఏమిటో అర్థం కాని పరిస్తితి . మే రెండో వారంలో సమ్మె నోటీసు ఇస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హెచ్చరించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ, అవి అమల్లోకి వస్తే పని గంటలు పెరగడం, జీతాలపై యాజమాన్యం నియంత్రణ పెరగడం, ఉద్యోగ భద్రత తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. అలాగే సింగరేణిలో మెడికల్ బోర్డు పునరుద్ధరణ, మారుపేర్ల సమస్య, ప్రమోషన్లు వంటి పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మరోవైపు హెచ్ఎంఎస్ సంఘం ఆరు ప్రధాన డిమాండ్లతో సమ్మె సైరన్ మోగించింది. వీఆర్ఎస్ పునరుద్ధరణ, వారసులకు ఉద్యోగాలు, స్వంత ఇంటి పథకం అమలు, కొత్త బొగ్గు గనుల ఏర్పాటు, ఇన్‌కమ్ ట్యాక్స్ రీఫండ్, ఇంటర్నల్ భర్తీలు, కార్పొరేట్ హాస్పిటల్ నిర్మాణం వంటి అంశాలను ముందుకు తెచ్చింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించింది. ఇక్కడ ముఖ్య అంశం ఏమిటంటే ప్రస్తుతం ఈ యూనియన్ కు మాజీ ఎంపి ,ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర సేన (టి ఆర్ ఎస్ ) అధినేత్రి కల్వకుంట్ల కవిత గౌరవ అధ్యక్షురాలి హోదాలో ఈ యూనియన్ ద్వారా సింగరేణి లోని అన్ని అంశాలపై స్పందిస్తున్నారు ,పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు .ఇక విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల సంస్థ ఆర్థికంగా బలహీనపడుతోందని సిఐటియు అనుబంధ సంఘం విద్యుత్ సౌధ ముట్టడి ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చింది. సింగరేణికి రావాల్సిన విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల సంస్థ ఆర్థికంగా బలహీనపడుతోందని, రక్షణ పరికరాలు, సంక్షేమ



పథకాలకు నిధుల కొరత ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో జెన్కో అధికారులు నెలకు 200 కోట్ల చొప్పున చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చినట్లు సంఘం తెలిపింది. అలాగే కారుణ్య నియామకాలు, మారుపేర్ల సమస్య, సొంతింటి పథకం, ఇన్‌కమ్ ట్యాక్స్ భారం వంటి అంశాలను కూడా ప్రస్తావించింది. ఈ మూడు ప్రధాన సంఘాల డిమాండ్లను పరిశీలిస్తే ఉద్యోగ భద్రత, వారసులకు ఉద్యోగాలు, గనుల విస్తరణ, కార్మిక సంక్షేమం, ఆర్థిక బలోపేతం వంటి అంశాలన్నీ ఒకే విధంగా ఉన్నాయని స్పష్టమవుతోంది. అయితే ఈ అంశాలపై సమిష్టి పోరాటం జరగకపోవడం వల్లే ఫలితాలు కనిపించడం లేదని కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

**కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి (జాక్) పోరాడాలేరా ....?**

గతంలో కార్మిక సంఘాలు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి సింగరేణి యాజమాన్యం, ప్రభుత్వంతో చర్చలు జరిపి అనేక సమస్యలను పరిష్కరించిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతం మాత్రం ప్రతి సంఘం తమదైన ఎజెండాతో ముందుకు సాగుతుండటం వల్ల ఒత్తిడి విభజన అవుతూ, ప్రభుత్వంపై ప్రభావం తగ్గుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటి పరిస్థితుల్లో సమ్మెల ప్రభావం కూడా మారిపోయింది. సమ్మె జరిగితే ఉత్పత్తి నిలిచిపోవడం, సంస్థకు ఆర్థిక నష్టం కలగడం, కార్మికులకు వేతన నష్టం వాటిల్లడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి. దీర్ఘకాలంలో చూస్తే సంస్థ బలహీనపడే ప్రమాదం కూడా ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ఇక వేలాది యువత కొత్త గనులు ఎప్పుడు వస్తాయా, ఉద్యోగాలు ఎప్పుడు కల్పిస్తారా అని ఎదురుచూస్తోంది. కానీ సంఘాల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల కొత్త నియామకాలు కూడా ఆలస్యమయ్యే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ అనుబంధాలు కూడా ఈ పరిస్థితిపై ప్రభావం చూపుతున్నాయి. ఒకవైపు రాష్ట్ర అధికార పార్టీ అనుబంధ సంఘం, మరోవైపు కేంద్ర ప్రభుత్వ అనుబంధ సంఘం, ఇతర జాతీయ సంఘాల మధ్య పోటీ భావన ఐక్యతకు అడ్డంకిగా మారుతోందని కార్మికులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సింగరేణి సమస్యల పరిష్కారం కోసం అన్ని కార్మిక సంఘాలు ఐక్య వేదికపైకి రావాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. జాయింట్ యాక్షన్ కమిటీని పునరుద్ధరించి, ఒకే డిమాండ్ చార్టర్‌తో ప్రభుత్వం, యాజమాన్యంతో చర్చలు జరిపితేనే స్పష్టమైన ఫలితాలు సాధ్యమవుతాయని భావిస్తున్నారు. సమ్మెలకు ముందు సమిష్టి చర్చలకు ప్రాధాన్యత ఇవ్వడం, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సంయుక్త పోరాటాలు నిర్వహించడం ద్వారా సింగరేణి సంస్థను బలోపేతం చేయడంతో పాటు కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరికే అవకాశముంది.

## సేవాబారతి ఆశ్రమ విద్యార్థుల ఘన విజయం

**10వ తరగతి ఫలితాల్లో మెరుగైన ప్రతిభ**

**బీజేపీ నేతల అభినందనలు**



**మంచిర్యాల, 3,మే (ప్రజాజ్యోతి ):** సేవాబారతి -- ఏకలవ్య ఆశ్రమంలో చదువుతున్న మారుమూల గ్రామాలకు చెందిన విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా విద్యార్థులను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, సేవాబారతి అధ్యక్షుడు ఒడ్నాల లక్ష్మి నారాయణ, కార్యదర్శి ఆనంద్ రావు, సభ్యురాలు సుప్రజ కలిసి శనివారం అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇలాంటి అద్భుత ఫలితాలు సాధించడం గర్వకారణమని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని సేవాబారతి ఆశ్రమాల్లో మంచిర్యాల ఆశ్రమ పాఠశాలకు చెందిన మెట్టుపల్లి రాజేష్ అత్యధిక మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలవడం విశేషమని కొనియాడారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిస్తూ, సేవాబారతి సంస్థ అందిస్తున్న విద్యా సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా నీట్ పరీక్ష

**316 మందికి 313 మంది హాజరు**

**పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్, మే 3: ప్రజా జ్యోతి** కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ కె.హరిత తెలిపారు. జిల్లా కేంద్రంలోని జనకపూర్‌లో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల, బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. జిల్లాలో 316 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 313 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. అభ్యర్థులను అడ్మిట్ కార్డుతో పాటు ప్రభుత్వ గుర్తింపు గల ఒరిజినల్ ఐడీ కార్డుతో అనుమతించామని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేశామని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి చేతి రుమాలు, మొబైల్ ఫోన్, చేతి గడియారం, బెల్టు, ఉంగరం, గొలుసు, చెవిపోగులు, ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ పరికరాలు, పెన్ను, పెన్సిల్, ఎరేజర్, షార్పనర్, కరెక్షన్ ఫ్లూయిడ్‌ను అనుమతించలేదన్నారు. పరీక్ష ప్రారంభం నుంచి చివరి వరకు వీడియో రికార్డ్ చేశామని, కేంద్రంలో 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 28 మంది ఇన్విజిలేటర్లు, ఒక పరిశీలకుడు, ఇద్దరు చీఫ్ సూపరింటెండెంట్లు విధులు నిర్వహిం చారని వివరించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అందజేశారు

## పీఎఫ్, ఈఎస్ఐ నిధుల మంజూరుకు ఎమ్మెల్యేకు కార్మికుల కృతజ్ఞతలు



**మంచిర్యాల, 3, మే (ప్రజా జ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన బిల్ కలెక్టర్లు, లైన్మెన్ సహా మొత్తం 141 మంది కార్మికులకు 2019 నుంచి 2026 వరకు రావలసిన పీఎఫ్, ఈఎస్ఐ నిధులుగా రెండు కోట్ల పైచిలుకు మొత్తాన్ని మంజూరు చేసిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు కు అలాగే కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్ కు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు సుదు మల్ల హరికృష్ణ కార్పొరేటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి సీసీ చౌరస్తాలో ఎమ్మెల్యేకు పాలాభిషేకంను నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కాలీద్, యూనియన్ అధ్యక్షులు కొయ్యల వెంకటి, గణేష్, రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై, తమకు రావలసిన నిధులను మంజూరు చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రేమ్ సాగరన్న అంబలి పంపిణీ సేవా కార్యక్రమం



**మంచిర్యాల,3, మే (ప్రజా జ్యోతి):**వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు కీ.శే కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ సేవా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు , కొక్కిరాల సురేఖమ్మ ల సారథ్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని మధ్యాహ్నం 39వ డివిజన్ కార్పొరేటర్ పూదరి సునీత ప్రభాకర్ ఆధ్వర్యంలో హమాలివాడ కేంద్రం వద్ద ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ప్రజలకు ఉచితంగా అంబలిని పంపిణీ చేశారు. ఎండ తీవ్రత నుంచి రక్షణ కల్పించడం, శరీరానికి చల్లదనం అందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈ సేవా కార్యక్రమం కొనసాగింది. ముఖ్యంగా మంచిర్యాల ఐ.బి. చౌరస్తా, బస్టాండ్, హమాలీవాడ, మార్కెట్ ప్రాంతం, నస్పూర్ సీసీసీ కార్నర్, అలాగే శ్రీరాంపూర్ బస్ స్టాండ్ కేంద్రాల్లో అంబలి పంపిణీ చేపట్టారు. ఈ కేంద్రాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబలిని స్వీకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాసేవే తమ ప్రధాన ధ్యేయమని, వేసవి కాలంలో ప్రజలకు ఉపశమనం కలిగించే ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి

సుగుణక్కకు సావర్ కేడ సర్పంచ్ వినతి
సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్న డీసీసీ అధ్యక్షురాలు



**ఆసిఫాబాద్, మే 3 ప్రజా జ్యోతి** సావర్ కేడ గ్రామ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సర్పంచ్ కావుడే తులసిరామ్ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్ అనక దేవురావు, వార్డు సభ్యులు, గ్రామస్తులు డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కను కలిశారు. కెరమెరి మండలంలోని సావర్ కేడ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం అత్యవసరమని, మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు. గ్రామస్తుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించిన సుగుణక్క, సమస్యలను పరిశీలించి పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత.



**దండేపల్లి, మే 3(ప్రజాజ్యోతి):** దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన మేడిచెరిమల రాకేష్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 20 వేల చెక్కును మాజీ సర్పంచ్ అనవేని ప్రేమలతతిరుపతి,మాజీ ఉప సర్పంచ్ దేవ లక్ష్మణ్ లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవ శ్రీనివాస్, మల్యాల సంతోష్ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐ టి డి ఎ ప్రాజెక్టు అధికారి మంద మకరందు



**కొమురం భీం జిల్లా ప్రతినిధి ( వాంకిడి ) మే 03 ప్రజా జ్యోతి** సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ– ఉట్నూర్ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మంద మకరందం ఆదివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత ను మర్యాదపూర్వ కంగా కలిసి మొక్కను అందజేశారు

## జన ఆగ్రహ సభను విజయవంతం చేయాలి

మంచిర్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్



**మంచిర్యాల, 3,మే (ప్రజా జ్యోతి):** ఈనెల 10న హైదరాబాదు లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న " జన ఆగ్రహ" సభను విజయవంతం చేయాలని మంచిర్యాల జిల్లా బిజెపి అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చెన్నూరు పట్టణంలో గోడ రాతలు రాసి సభకు ప్రజలను ఆహ్వానించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడవసారి ప్రధానిగా ఎన్నికైన తర్వాత మొదటిసారి రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో ఈ భారీ బహిరంగ సభకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. కార్మికులు, రైతులు, వ్యాపారులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలు అమలు కాకపోవడంతో మహిళలు, రైతులు, యువతి యువకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించే జన ఆగ్రహ సభలో ప్రజలు విస్తృతంగా పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తా రని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు తుమ్మ శ్రీపాల్, ఉపాధ్యక్షులు కొత్తూరు దుర్గాప్రసాద్, అవిరచెట్టి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ ఎఫెక్ట్‌తో జిల్లా వ్యాప్తంగా హై అలర్ట్

-- జైపూర్‌లో ముమ్మర పోలీస్ తనిఖీలు



**జైపూర్ మే 3 ప్రజా జ్యోతి** కరీంనగర్‌లోని పీఎంజే జువెలరీ షోరూమ్‌లో జరిగిన దోపిడీ ఘటన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు హై అలర్ట్ ప్రకటించారు. ఈ క్రమంలో అన్ని మండల కేంద్రాల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేస్తూ, వాహనాలపై క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా సరిహద్దుల వద్ద నిఘా పెంచి, అనుమానాస్పద వాహనాలు, వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. డాగ్ స్క్వాడ్ సహాయంతో విస్తృతంగా తనిఖీలు చేపడుతూ నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో జైపూర్ మండలంలోని ఇందారం గ్రామంలో స్థానిక ఎస్సై భూమేష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు. హైవేపై చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని ఆపి పత్రాలను పరిశీలించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ వంటి పత్రాలు తనిఖీ చేయడంతో పాటు అనుమానాస్పదంగా కనిపించిన వాహనాలను ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే 100కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి తనిఖీలు మరింత కఠినంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# సింగరేణిలో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు సిద్ధం కావాలి

### గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పిలుపు


**మంచిర్యాల, 3,మే (ప్రజా జ్యోతి):**సింగరేణి సంస్థలో కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ మే రెండో వారంలో సమ్మె నోటీసు యాజమాన్యానికి ఇవ్వనున్నట్లు ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ లు తెలిపారు. ఈ మేరకు ఇతర కార్మిక సంఘాలతో చర్చలు కొనసాగిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ వివరించారు. గత ఏడు నుంచి ఎనిమిది నెలలుగా కార్మికుల సమస్యలను యాజమాన్యం మరియు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లినా పరిష్కారం చూపకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. గుర్తింపు సంఘం ఎన్నికల తర్వాత పలువురు డైరెక్టర్లు, సి అండ్ ఎండి, జీఎం పర్సనల్ అధికారులు మారినా సమస్యల పరిష్కారం జరగలేద న్నారు.గతంలో జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడం లేదని, ముఖ్యంగా మెడికల్ బోర్డు నిర్వహణలో జాప్యం కారణంగా అనారోగ్యంతో బాధపడు తున్న కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని తెలిపారు. వెంటనే మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా మారు పేర్లు, విజిలెన్స్ కేసులకు సంబంధించిన కార్మికుల ఆధారితులకు ఉద్యోగాలు ఇవ్వడంలో యాజమాన్యం ఆలస్యం చేస్తోందని విమర్శించారు. అడ్వకేట్ జనరల్‌కు లీగల్ అభిప్రాయం కోసం పంపిన



అంశం సంవత్సరం దాటినా పరిష్కారం కాలేదని, సంబంధిత కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నా యని తెలిపారు. వెంటనే వారికి ఉద్యోగాలు కల్పించా లని డిమాండ్ చేశారు.మైనింగ్, క్లరికల్, ట్రేడ్స్‌మెన్ విభాగాలకు చెందిన సమస్యల పరిష్కారం, సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌పై ఆదాయపన్ను యాజమాన్యమే చెల్లించడం, కొత్త గనుల ప్రారంభం, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన 51 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిస్మిస్ అయిన కార్మికులకు ఒకసారి అవకాశం కల్పించాలని కోరారు.మే మొదటి వారంలోగా యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు సంఘంతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించ కపోతే మే రెండో వారంలో సమ్మె నోటీసు ఇస్తామని హెచ్చరించారు. అనంతరం ఇతర సంఘాలతో చర్చించి సమ్మె తేదీని ప్రకటించి సింగరేణిలో సమ్మె సైరన్ మోగిస్తామని స్పష్టం చేశారు.

# మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

**మంచిర్యాల, 3, మే (ప్రజా జ్యోతి):**మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో కమిషనర్ల వరుస బదిలీలు ఆసక్తికరంగా మారాయి. తక్కువ కాల వ్యవధిలోనే అధికారులు బదిలీ కావడం మున్సిపల్ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. సాధారణంగా ప్రభుత్వ సేవల్లో బదిలీలు నిబంధనల ప్రకారం జరిగే సాధారణ ప్రక్రియ అయినప్పటికీ, ఒక ప్రాంతానికి వచ్చిన అధికారులు అక్కడి సమస్య లను సమగ్రంగా అర్థం చేసుకు ని అభివృద్ధి పనులపై దృష్టి పెట్టేలోపే బదిలీ అవుతుండ టం గమనార్హంగా మారింది.ఇదే విషయంపై ప్రతిపక్ష పార్టీలు, రాజకీయ పరిశీల కులు రాజకీయ కోణం ఉండవచ్చని అభిప్రాయపడు తున్నారు. మంచిర్యాల మున్సిపాలిటీగా ఉన్న సమయంలో ఫిబ్రవరిలో తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి తొటం శివాజీని కమిషనర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేలోపే ఆయన బదిలీ కావడం చర్చనీయాంశమైంది. ఆయన స్థానంలో పూర్తి స్థాయి కమిషనర్‌ను తక్షణమే నియమించకపోవడం కూడా విమర్శలకు తావిచ్చింది.తరువాత మున్సిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయిన అనంతరం, 60 డివిజన్లతో ఏర్పాటైన ఈ కార్పొరేషన్‌కు జి. అన్వేష్ ఈ ఏడాది జనవరి 24న కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయన హయాంలోనే ఎన్నికలు నిర్వహించి కొత్త పాలకవర్గం ఏర్పాటు జరిగింది. అయితే తాజాగా ఆయనను వేములవాడకు బదిలీ చేయడం మరోసారి చర్చకు దారితీసింది. తాజాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకేసారి ఎనిమిది మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీ జరగడం ఇదే తొలిసారిగా భావిస్తున్నారు. ఇందులో భాగంగా ములుగు కమిషనర్ రమేష్‌ను బెల్లంపల్లికు బదిలీ చేయగా, ఇతర అధికారులను కూడా పరస్పరం మార్చడం జరిగింది.ముఖ్యంగా మంచిర్యాలలో గత రెండేళ్లలోనే




మున్సిపాలిటీ నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌గా మారిన తర్వాత నలుగురు కమిషనర్లు మారడం పలు అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. దీనికి బలమైన కారణాలు ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రస్తుతం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, కోట్లాది రూపాయల బకాయిల వసూళ్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుల వసూళ్లు, భూముల ఆక్రమణలు, అక్రమాలు వంటి అంశాలు కీలకంగా నిలిచాయి. ఇలాంటి సమయంలో స్థిరత్వంతో పనిచేసే కమిషనర్ అవసరం ఉందని స్థానికులు భావిస్తు న్నారు.ఏదేమైనా, వరుస బదిలీలు పరిపాలనా స్థిరత్వాన్ని దెబ్బతీస్తు న్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కనీసం కొంతకాలం పాటు నిరంతరం గా పనిచేసే కమిషనర్‌ను నియమించి, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

## వర్ష బీభత్సం.. మందమర్రి ప్రజలపై ప్రకృతి పంజా

భారీ గాలివానకు నేలకొరిగిన చెట్లు -- చీకట్లో మునిగిన కాలనీలు

-- బరిలోకి దిగిన రెస్క్యూ సిబ్బంది



**మంచిర్యాల ప్రతినిధి మే 3 ప్రజా జ్యోతి** మంచిర్యాల జిల్లా మందమర్రి, కాసిపేట, క్యాతనపల్లి ప్రాంతాల్లో అకాల వర్షం బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. పలుచోట్ల భారీ చెట్లు నేలకొరిగి రహదారులపై పడటంతో వాహనాలు సైతం ధ్వంసం అయ్యాయి రోడ్డుపై పడిన చెట్లతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగి తీగలు తెగిపోవడంతో అనేక కాలనీలు చీకట్లో మునిగిపోయాయి.విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు, వెంటనే సింగరేణి రెస్క్యూ సిబ్బంది తో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది రంగంలోకి దిగి చెట్ల తొలగింపు పనులు చేపట్టారు.

## దేశ అభివృద్ధిలో జనాభా లెక్కలకు అత్యంత ప్రాముఖ్యత

### మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు



మంచిర్యాల, మే 3 (ప్రజా జ్యోతి): తెలంగాణ 2027 జనాభా లెక్కల స్వీయ గణన కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదివారం పాల్గొన్నారు.ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారతదేశ జనాభా లెక్కలు 2027కు సంబంధించి తెలంగాణ రాష్ట్రంలో 2026 ఏప్రిల్ 26 నుండి స్వీయ గణన అధికారికంగా ప్రారంభమైందని, మే 10 వరకు ఈ సౌకర్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు.దేశ అభివృద్ధి లో జనాభా లెక్కలకు అత్యంత ప్రాముఖ్యత ఉందని పేర్కొన్న ఆయన, తాను స్వయంగా పాల్గొన్నానని, ప్రజలందరూ ఈ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని ఖచ్చితమైనసమాచా రాన్ని అందించాలని పిలుపునిచ్చారు.అధికారిక వెబ్‌సైట్ ద్వారా స్వీయ గణన ప్రక్రియను సులభంగా పూర్తి చేయ వచ్చని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికా రచన, సుపరిపాలన, సమాన అభివృద్ధి కోసం జనాభా లెక్కలు పునాది రాయి వంటివని, స్వీయ గణన సమగ్ర సమాచార సేకరణకు బలమైన వ్యవస్థగా ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సీపీఓ పాపయ్య, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్నీ మధుకర్, డీవైఎస్‌వో రాజేందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ రంగ సంస్థలతోనే ప్రజా సంక్షేమం సాధ్యం

## మంచిర్యాల సదస్సులో బీమా సంఘ నాయకులు

**మంచిర్యాల, 3, మే (ప్రజా జ్యోతి):** ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ ను దేశభక్తియుత కర్తవ్యంగా ప్రజలు చేపట్టాలని ఆలిండి యా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి కె. వేణుగోపాల్ అ న్నారు. సీనియర్ ఉద్యమ నాయకులు రంగు రాజేశం ఎల్ఐసి సంస్థ నుంచి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన ఉద్యమ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాల కారణంగా ప్రజా సంక్షేమం గాడి తప్పుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ లాభాలకే ప్రాధాన్యం పెరుగుతోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలే నేటి కాలపు దేవాలయాలని అభివర్ణించారు. మత రాజకీయాలతో ప్రజలను మోసగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆ మత్తులో నష్టపోయేది సాధారణ ప్రజలేనని హెచ్చరించారు. కార్పొరేట్ల కు అనుకూలంగా వ్యవహరించే నాయకులు అధికారంలోకి వచ్చి ప్రజాసంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని కార్పొరేట్లకు రాయితీల రూపంలో అందిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం జరుగుతున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. యూనియన్ జోనల్ అధ్యక్షులు పి. సతీష్ మాట్లాడుతూ, ప్రపంచ ఆర్థిక సంక్షోభ



సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టింది ప్రభుత్వ రంగ సంస్థలేనని గుర్తుచేశారు. ప్రజల సొమ్మును సమీకరించి ప్రజా సంక్షేమానికి వినియోగించే బాధ్యతను ఎల్ఐసి సమర్థంగా నిర్వహిస్తోందని తెలిపారు. ప్రజలు గట్టిగా నిలబడినప్పుడే ప్రభుత్వ రంగ సంస్థలు కాపాడబ డతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి టీఎన్వీఎస్ రవీంద్రనాథ్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ కరీంనగర్ అధ్యక్షులు రామ్మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి వామన్ రావు, సంయుక్త కార్యదర్శి రంగు రాజేశం, ఐఎఫ్టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి టి. శ్రీనివాస్, బసవేశ్వర్, ఎం. రామదాసు, రమేష్ బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమశక్తి అవార్డు గ్రహీత జెట్టి శంకర్ రావుకు ఘన ఆత్మీయ అభినందన సభ

**మంచిర్యాల, 3,మే (ప్రజా జ్యోతి):** శ్రమశక్తి అవార్డు గ్రహీత, ఐఎన్టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు శ్రీ జెట్టి శంకర్ రావుకు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం నస్పూర్ కాలనీ ప్రెస్ క్లబ్ వద్ద ఘనంగా ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఇటీవల మే 1న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డు అందుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సభకు ముందు సిసిసి కార్నర్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, శ్రీరాంపూర్ బస్టాండ్ కార్మిక విగ్రహానికి జెట్టి శంకర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సభలో ఐఎన్టీయూసీ నాయకులు, కార్యకర్తలు ఆయనను గజమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భం గా ఐఎన్టీయూసీ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి జి. స్వామి, జాతీయ నాయకులు సిహెచ్ భీమ్ రావు మాట్లాడుతూ, జెట్టి శంకర్ రావు నాలుగు దశాబ్దాలుగా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ సేవలందిస్తు న్నారని కొనియాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యూనియన్ అగ్రనాయకులతో సమన్వయం చేస్తూ యజమాన్యంపై పోరాటాలను నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి శ్రమశక్తి అవార్డు ప్రదానం చేయడం కోల్‌బెల్ట్ ప్రాంత కార్మిక ఉద్యమానికి గౌరవకారణమన్నారు. అనంతరం జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ, తనకు లభించిన ఈ అవార్డు వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా యూనియన్ మొత్తం కృషికి లభించిన గుర్తిం పని అన్నారు. తనపై విశ్వాసం ఉంచి అవార్డుకు సిఫార్సు చేసిన నాయకులు, అవార్డు ప్రదానం చేసిన మంత్రి గడ్డం వివేక్ వెంకట



స్వామి, అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, యూనియన్ నాయకు లు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడతానని, రానున్న యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ నాయకులు సిహెచ్ భీమ్ రావు, జి. స్వామి, కె. శ్యామ్, పి. తిరుపతి రాజు, పేరం రమేష్, ఏ. రవీందర్ రెడ్డి, ఎల్. శ్రీనివాస్, ఐ. తిరుపతిరెడ్డి, జె. నర్సింగ్, జీవన్ జోయల్, పి. మల్లారెడ్డి, ఆర్. గోపాల్ రెడ్డి, కె. మనోజ్, జీవన్ రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడు కోల్ మైనర్స్ "డే"

## కనిపించని కష్టం, కనిపించే అభివృద్ధి




**మంచిర్యాల, 3,మే (ప్రజా జ్యోతి):** నేడు కోల్ మైనర్స్ డే. ఈ సంద ర్భంగా గనికా ర్మికుల కష్టసు ఖాలపై సమా జం మరోసారి ఆలోచించాల్సి న అవసరం ఏర్పడింది. మే 4న జరుపుకు నే ఈ దినోత్స వం,దేశ అభి వృద్ధి వెనుక కనిపించని కార్మికుల శ్రమను గుర్తుచేస్తుంది. విద్యుత్ దీపాలు వెలిగే ప్రతి ఇంటి వెనుక, పరిశ్రమలు పరుగులు తీసే ప్రతి నగర వెనుక, నేల అడుగున చెమటలు చిందిస్తున్న గనికార్మికుల జీవితం దాగి ఉంది. భారతదేశ ఆర్థిక వ్యవస్థలో బొగ్గు కీలక పాత్ర పోషిస్తోంది. విద్యుత్ ఉత్పత్తిలో ఇప్పటికీ బొగ్గు ప్రధాన వనరుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గనికార్మికుల శ్రమ లేకుండా దేశ అభివృద్ధి అసంపూర్తిగా మిగులుతుంది. అయితే, ఈ వాస్తవాన్ని గుర్తించడంలో సమాజం మరియు పాలక వ్యవస్థలు తరచూ విఫలమవు తున్నాయి. గనుల్లో పనిచేయడం ఒక సాధారణ ఉద్యోగం కాదు---ప్రాణాలను పణంగా పెట్టే పోరాటం. పేలుళ్లు, గనులు కూలి పోవడం, విషవాయువుల ప్రభావం, ఊపిరితిత్తుల వ్యాధులు వంటి ప్రమాదాలు గనికార్మికు ల దైనందిన జీవితంలో భాగమే. అయినప్పటికీ, భద్రతా ప్రమాణాలు అన్ని చోట్ల సమర్థంగా అమలవు తున్నాయా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం కనిపించడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే స్పందించడం కాకుండా, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరం. ఇంకా ఒక ముఖ్య అంశం కార్మికుల సామాజిక భద్రత. సరైన వేతనాలు, ఆరోగ్య బీమా, పెన్షన్, కుటుంబాలకు విద్యా అవకాశాలు ఇవన్నీ హక్కులు; దయాదాక్షిణ్యాలు కావు. గనికార్మికుల కుటుంబాలు కూడా సమానంగా కష్టాలను అనుభవిస్తాయి. ఒక ప్రమాదం జరిగితే కుటుంబం మొత్తం ఆర్థికంగా కుంగి పోతుంది. ఈ పరిస్థితిని మార్చేందుకు కఠినమైన విధానాలు అవసరం. ప్రపంచవ్యాప్తంగా గనికార్మికులను గౌరవించే భావన ఉన్నప్పటికీ, ఒకే తేదీతో జరుపుకునే అంతర్జాతీయ దినం లేదు. ఇది ఒక దేశానికి మాత్రమే పరిమితమైన సమస్య కాదు. పారిశ్రామీకరణతో పాటు వచ్చిన సామాజిక బాధ్యతగా దీన్ని చూడాలి. పర్యావ రణ పరిరక్షణ పేరుతో బొగ్గు వినియోగాన్ని తగ్గించే ప్రయత్నాలు జరుగుతు న్నాయి. అయితే, ఈ మార్పులో గనికార్మికుల భవిష్యత్తుకు స్పష్టమైన ప్రణాళిక లేకపోతే మరో సామాజిక సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉంది. కాబట్టి, కోల్ మైనర్స్ డే సందర్భంగా కేవలం స్మరణతో ఆగి పోకుండా విధానపరమైన మార్పులపై దృష్టి పెట్టాలి. భద్రత, సంక్షేమం, ప్రత్యామ్నాయ ఉపాధి---ఈ మూడు అంశాలు ప్రభుత్వాల ప్రాధాన్యంగా మారాలి. గనికార్మికుల కష్టం దేశానికి వెలుగునిస్తే, ఆ వెలుగులో వారికి కూడా గౌరవప్రదమైన జీవితం కనిపించాలి. అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి గణాంకాలు కాదు; ఆ ఉత్పత్తి వెనుక ఉన్న మనుషుల జీవితాలే నిజమైన ప్రమాణం. గనికార్మికుల కష్టాన్ని గౌరవించి, వారి భవిష్యత్తును భద్రపరిచినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవు తుందని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## భక్తి శ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న ఎస్పై భూమేష్ కుటుంబం



జైపూర్ మే 3 (ప్రజా జ్యోతి) జైపూర్ మండలంలోని వేలాల గ్రామంలో గట్టు మల్లన్న స్వామిని స్థానిక ఎస్సై భూమేష్ ఆదివారం కుటుంబ సమేతంగా ప్రసిద్ధ గట్టు మల్లన్న స్వామి దేవాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పురోహితులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించు కోవడంతో పాటు సమాజంలో శాంతి, సౌహార్దం కాపాడేందుకు కృషి చేయాలి. ఆలయాలకు వచ్చే భక్తులు క్రమశిక్షణ పాటిస్తూ పరస్పరం సహకరించాలి అని తెలిపారు.

## వానాకాలం సాగుకు సిద్ధం

**విత్తనాలు, ఎరువుల లభ్యత పై జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్ర కటన**



ఆదిలాబాద్ బ్యూరో,మే 3 (ప్రజా జ్యోతి) ఆదిలాబాద్ జిల్లాలోని రైతాం గానికి 2026 వానాకాలం సీజ న్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువుల లభ్యతపై ఎటువం టి ఆందోళన అవసరం లేదని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. మే 2, 2026 నాటికి జిల్లాలోని వివిధ విత్తన డీలర్ల వద్ద 1,24,70 0 పత్తి విత్తన ప్యాకెట్లు, 900 క్వింటాళ్ల సోయాబీన్ విత్తనాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా అవసరాలకు మించి పత్తి, సోయాబీన్ విత్తనాలను సరఫరా చేసేందుకు విత్తన కంపెనీలు సిద్ధంగా ఉన్నాయని, వచ్చే వారం రోజుల్లో అన్ని విత్తన దుకాణాలకు పూర్తిస్థాయిలో నిల్వలు చేరుకుంటాయని వి వరించారు. ఎరువుల విషయంలో జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో ఉందని, ప్రస్తుతం జిల్లాలోని ప్రైవేట్ దుకాణాలు, మార్కెట్ యా ర్డుల్లో కలిపి మొత్తం 6,565 మెట్రిక్ టన్నుల యూరియా, 381 మెట్రిక్ టన్నుల డి.ఏ.పి, 13,759 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉ న్నాయని తెలిపారు. సాగు సమయానికి ఎరువుల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆయన స్పష్టం చే శారు. ఇదే క్రమంలో రైతులు విత్తనాల కొనుగోలు విషయం లో అత్యంత జాగ్రత్తగా ఉండా లని, కేవలం గుర్తింపు పొందిన అధికృత డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేసి తప్పని సరిగా రశీదు పొంది పంట కాలం ముగిసే వరకు దానిని భ ద్రపరుచుకోవాలని కోరారు. రాత్రి సమయాల్లో గ్రామాల్లోకి వచ్చి విక్రయించేలూజ్ విత్త నాలను కొని మోసపోవద్దని, ఎవరైనా అక్రమ విక్రయాలకు పాల్పడితే వెంటనే వ్యవసాయ లేదా పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా నిషేధిత బీటీ-3 విత్తనాలు, గ్లైఫో సేట్ వంటి గడ్డి మందుల వాడకం, విక్రయం చట్టరీత్యా నేరమని కలెక్టర్ హెచ్చరించారు. రైతులు తమ ప్యాకెట్లపై ఉన్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఏవైనా సందే హాలు లేదా ఇబ్బందులు ఎదు రైతే జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నంబర్ 8977742854 ను సంప్రదించాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## వార్డులో నీటి సమస్యకు పరిష్కారం చూపిన కౌన్సిలర్

**మోటార్ మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపు**

**ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా: జాడి వినోద్ కుమార్**



ఆసిఫాబాద్, మే 3 (ప్రజా జ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులో కొద్ది రోజులుగా నెలకొన్న నీటి సమస్యను కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ తక్షణమే పరిష్కరించారు. ప్రజల నుంచి ఫిర్యాదు అందిన వెంటనే సిబ్బందితో కలిసి వాటర్ ట్యాంక్ వద్దకు చేరుకుని మోటార్ పనితీరును పరిశీలించారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను తొలగించి, మోటార్‌కు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయించారు. దీంతో వార్డులో నీటి సరఫరా మళ్లీ సాధారణంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా కౌన్సిలర్ జాడి వినోద్ కుమార్ మాట్లాడుతూ, వార్డు ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజలు ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చని తెలిపారు

## సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ ఎఫ్ ఆర్ వో గా ముక్తార్ హైమద్



ఇచ్చోడ/ సిరికొండ, మే 3 (ప్రజా జ్యోతి)ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం సిరిచెల్మ కవ్వాల్ టైగర్ జోన్ అటవీ క్షేత్రాధికా రి ఎఫ్ ఆర్ ఓ గా ముక్తార్ హైమ ద్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎఫ్ఆర్ఓ గా పనిచేసిన నాగ స్వామి ఇటీవల పదవి విరమణ చేయడంతో ఉట్నూర్ మెగా విభాగంలో విధులు నిర్వహిస్తున్న ముక్తార్ హైమద్‌కు అదనపు బాధ్యతలు కేటాయిస్తూ సిరి చల్మా టైగర్ జోన్ రేంజ్ అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఇచ్చోడ లో ఉన్న సిరి చర్మ టైగర్ జోన్ అటవీ క్షేత్రాధికారి కార్యాల యంలో ఇన్చార్జి బా ధ్యతల ను స్వీకరించారు. ఈ సంద ర్భంగా సిబ్బంది ఆయన కు పుష్పగుచ్చాలు అందజేస్తూ స్వాగతం పలికి అభినం దన లు తెలిపారు.

## శ్రమశక్తి అవార్డు గ్రహీత జెట్టి శంకర్ రావుకు ఘన ఆత్మీయ అభినందన సభ





మంచిర్యాల, 3,మే (ప్రజా జ్యోతి):శ్రమశక్తి అవార్డు గ్రహీత, ఐఎన్‌టీయూసీ కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షులు శ్రీ జెట్టి శంకర్ రావుకు మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆదివారం నస్పూర్ కాలనీ ప్రెస్ క్లబ్ వద్ద ఘనంగా ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఇటీవల మే 1న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా శ్రమశక్తి అవార్డు అందుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సభకు ముందు సిసిసి కార్నర్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి, శ్రీరాంపూర్ బస్టాండ్ కార్మిక విగ్రహానికి జెట్టి శంకర్ రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సభలో ఐఎన్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు ఆయనను గజమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భం గా ఐఎన్‌టీయూసీ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి జి. స్వామి, జాతీయ నాయకులు సిహెచ్ భీమ్ రావు మాట్లాడుతూ, జెట్టి శంకర్ రావు నాలుగు దశాబ్దాలుగా కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ సేవలందిస్తు న్నారని కొనియాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యూనియన్ అగ్రనాయకులతో సమన్వ యం చేస్తూ యజమాన్యంపై పోరాటాలను నిర్మించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి శ్రమశక్తి అవార్డు ప్రదానం చేయడం కోల్‌బెల్ట్ ప్రాంత కార్మిక ఉద్యమానికి గౌరవకారణమన్నారు. అనంతరం జెట్టి శంకర్ రావు మాట్లాడుతూ, తనకు లభించిన ఈ అవార్డు వ్యక్తిగత గౌరవం మాత్రమే కాకుండా యూనియన్ మొత్తం కృషికి లభించిన గుర్తింపని అన్నారు. తనపై విశ్వాసం ఉంచి అవార్డుకు సిఫార్సు చేసిన నాయకులు, అవార్డు ప్రదానం చేసిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, అలాగే స్థానిక ప్రజాప్రతినిధులు, యూనియన్ నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా కార్మికుల సమస్యల పరిష్కారంలో ముందుండి పోరాడతానని, రానున్న యూనియన్ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు సిహెచ్ భీమ్ రావు, జి. స్వామి, కె. శ్యామ్, పి. తిరుపతి రాజు, పేరం రమేష్, ఏ. రవీందర్ రెడ్డి, ఎల్. శ్రీనివాస్, ఐ. తిరుపతిరెడ్డి, జె. నర్సింగ్, జీవన్ జోయల్, పి. మల్లారెడ్డి, ఆర్. గోపాల్ రెడ్డి, కె. మనోజ్, జీవన్ రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోనే మూడు కోట్లకు పైగా సభ్యులతో అత్యంత శక్తివంతమైన కార్మిక సంఘంగా ఐఎన్‌టీయూసీ

## శ్రీరాంపూర్‌లో ఘనంగా ఐఎన్‌టీయూసీ 79వ ఆవిర్భావ దినోత్సవం



**మంచిర్యాల, 3, మే (ప్రజా జ్యోతి):**దేశంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) అని నాయకులు అ న్నారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియాలో ఆదివారం ఐఎన్‌టీయూసీ 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నస్పూర్ ప్రెస్ క్లబ్ హాల్లో జరిగిన కార్యక్రమా నికి శ్రమశక్తి అవార్డు గ్రహీత, ఐఎన్‌టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం లో భాగంగా కేక్ కట్ చేసి అనంతరం కార్యకర్తలు, కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 1947 మే 3న న్యూఢిల్లీలో జరిగిన సదస్సులో సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షతన, జేబీ కృపలాని చేతుల మీదుగా ఐఎన్‌టీయూసీ స్థాపించబడిందని ఆయన గుర్తుచేశారు. దేశంలోనే మూడు కోట్లకు పైగా సభ్యులతో అత్యంత శక్తివంతమైన కార్మిక సంఘంగా ఐఎన్‌టీయూసీ నిలిచిందని, కార్మిక సంక్షేమం, అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సంస్థ స్థాపన నుంచి నేటి వరకు యూనియన్ సిద్ధాంతాలకు కట్టుబడి కార్మికుల హక్కుల సాధన కోసం అనేక ఉద్యమాలు నిర్వహించి విశిష్ట చరిత్ర సృష్టించిందన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలు చేస్తూ దేశ ఆర్థిక వృద్ధికి కూడా ఐఎన్‌టీయూసీ కీలకంగా పనిచేస్తోందన్నారు. పరిశ్రమల పరిరక్షణతో పాటు కార్మిక చట్టాల అమలులో ముందుండే ఏకైక పెద్ద కార్మిక సంఘం ఐఎన్‌టీయూసీ యే నని స్పష్టం చేశారు. కార్మికుల కు ఉద్యోగ భద్రత, రిజర్వేషన్లు, పెన్షన్, గ్రాట్యుటీ, విద్య, వైద్యం వంటి అనేక హక్కులు, సౌకర్యాల సాధనలో ఐఎన్‌టీయూసీ కీలకపాత్ర పోషించిందని వివరించారు. కేంద్రంలో ని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ చట్టాలు కార్మిక హక్కులను దెబ్బ తీసేలా ఉన్నాయని ఆరోపిస్తూ, వాటిని వ్యతిరేకించేందుకు ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని, ఆ పోరాటానికి కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నాయకులు సీహెచ్ భీమ్ రావు, జీ స్వామి, కె శ్యామ్, పీ తిరుపతి రాజు, పేరం రమేష్, జీవన్ జోయల్, ఏ రవీందర్ రెడ్డి, ఎల్ శ్రీనివాస్, ఐ తిరుపతిరెడ్డి, పీ మల్లారెడ్డి, జె నర్సింగ్, ఆర్ గోపాల్ రెడ్డి, జీవన్ రావు, వెంకటేశ్వర్లు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# మార్ఫింగ్ ఫోటోలతో బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసిన ఇద్దరు అరెస్ట్

నిందితుల సెల్ఫోన్ స్వాధీనం

ఎలాంటి బ్లాక్మెయిలింగ్ గురైన వెంటనే పోలీసులను సంప్రదించం చాలి

మావల ఎస్ హెచ్ఓ రాహుల్ కాంత్ ఐపిఎస్



**ఆదిలాబాద్ బ్యూరో, మే 3 (ప్రజా జ్యోతి)** మార్ఫింగ్ ఫోటోలతో బ్లాక్ మె యిల్ చేసి డబ్బులు వసూ లు చేసిన ఇద్దరు నిందితులు ఎ1ఎర్రపోగుల పవన్ కుమార్ (28), వృత్తి: కార్ డ్రైవర్, నివాసం: సుభాష్ నగర్, ఆదిలాబాద్. ఎ2: మర్రి రాధ (46), వృత్తి: వ్యాపారి, నివాసం: టైలర్స్ కాలనీ, ఆదిలాబాద్ లను అరె స్టు చేసి రిమాండ్ కు తరలిం చినట్లు మావల ఎస్ హెచ్ ఓ ఐ పీ ఎస్ రాహుల్ కాంత్ తెలిపారు. మావల పోలీస్‌లు బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూ లు చేస్తున్న ఇద్దరు నిందితుల ను అరెస్ట్ చేశారు. బాధితుడి ఫోటోను మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో పరువు తీసే విధంగా ప్రచారం చేస్తామని బె దిరిస్తూ డబ్బులు వసూలు చే సిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుడి ఫోటోను గోప్యంగా సేకరించిన ప్రధాన నిందితుడు, మరో నిందితురాలి సహ కారంతో మార్ఫింగ్ చేసి, అనైతిక సంబంధాలు ఉన్నట్లు త ప్పుడు ప్రచారం చేస్తామని బె దిరించి పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేశారు. భయంతో బాధితుడు గతంలో పలు మార్లు డబ్బులు చెల్లించినట్లు దర్యాప్తులో వెలుగులోకి వ చ్చింది. తాజాగా 3-05-2026 తేదీన విశ్వసనీయ సమాచా రం మేరకు మావల పోలీస్ సి బ్బంది దస్నాపూర్ సమీపం లోని తిరుమల పెట్రోల్ బంక్ వద్ద ఇద్దరు నిందితులను అ దుపులోకి తీసుకున్నారు. నిం దితుల వద్ద నుండి బ్లాక్ మె యిల్‌కు ఉపయోగించిన మొ బైల్ ఫోన్‌ను స్వాధీనం చేసు కున్నారు. కేసును భారతీయ న్యాయ సంహిత (బిఎన్ ఎస్) చట్టం ప్రకారం సెక్షన్ 308(2) తీ/ష 3(5) కింద నమోదు చేసి, ఇద్దరు నిందితులను 15 రోజుల న్యాయ పరిరక్షణ (రిమాం డ్) కు తరలించారు. ఇద్దరు నిందితులు ఇదే తరహాలో మ రికొంతమందిని లక్ష్యంగా చే సుకుని డబ్బులు వసూలు చేసి ఉండే అవకాశం ఉన్నందున, పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోంది.

# మార్లవాయిలో ప్రాజెక్టు అధికారి సందర్శన

### ఆదివాసీల ఆత్మబంధువులు హైమెండార్ఫ్ దంపతులు: అధికారులు

### డార్ఫ్ దంపతులు, కొమురం భీం విగ్రహాలకు నివాళి





**ఆసిఫాబాద్ మే 3 ప్రజా జ్యోతి** ఆదివాసీల ఆత్మబంధువులు క్రిస్టోఫ్ వాన్ ఫ్యూరర్-హైమెండార్ఫ్ (హైమన్ డార్ఫ్) మరియు ఆయన సతీమణి బెట్టి ఎలిజబెత్ అని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందం పేర్కొన్నారు. ఆదివారం ఉట్నూర్ పరిధిలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డార్ఫ్ దంపతులు మరియు ఆదివాసి పోరాట యోధుడు కొమురం భీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం డార్ఫ్ మ్యూజియం, రీడింగ్ లైబ్రరీ, గుసాడి శిక్షణ కేంద్రం, గోండ్వాన పంచాయతీ రాజ్ కేంద్రం, 1941లో డార్ఫ్ దంపతులు నివసించిన స్థలం, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ప్రాంతాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మొదటిసారిగా గ్రామాన్ని సందర్శించిన ప్రాజెక్టు అధికారికి గ్రామస్థులు సంప్రదాయ డప్పు వాద్యాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఆదివాసుల అభివృద్ధికి కృషి చేసిన మహనీయులు అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. మార్లవాయి గ్రామం చారిత్రక ప్రాధాన్యత కలిగినదని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడం అందరి బాధ్యత అని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పిల్లలు తప్పనిసరిగా చదువుకోవాలని, డ్రాప్‌ఔట్ లేకుండా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హ గిరిజనుడికి అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జైనూర్ ఏటీడీఓ శ్రీనివాస్, సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్వరరావు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు

# రైతన్న కష్టం.. బుగ్గిపాలు

**బోథ్, మే 3 (ప్రజా జ్యోతి)** నేడు అన్నదాత అంపశయ్యపై ఉండి సమస్యలు ఎన్ని ఎదురైనా స్వేదాన్ని నమ్ముకొని సాగుతున్న అలసి సొలసిపోని శ్రామిక సాగుదారుడు. అటువంటి దేశానికి వెన్నెముక అయిన అన్నదాత కు అనేకరకాలుగా ఆపదలు. ప్రకృతి వైపరీత్యాలు ఒకవైపు అతి అనావృష్టి క్షమ పరిస్థితులు మరోవైపు దళారుల వ్యవస్థ, గిట్టుబాటు ధరలు, రుణభారం, పెట్టుబడి సమస్యలు, కరెంటు కోతలు, మార్కెట్ సౌకర్యాలు, ఇలా ఒక్కటేమిటి ఎన్నో రకాలుగా రైతన్నలను జలగలా పట్టిపీడిస్తున్నాయి. ఎన్ని కష్టా నష్టాలు ఎదురైనా తాను నమ్ముకున్న సాగును మాత్రం విడిచిపెట్టలేక సాగుదారునిగా సాగిపోతూనే ఉన్నాడు. దేశానికి ప్రజల కడుపు నింపే అన్నదాతగా చరిత్రలో నిలిచిపోతూనే ఉన్నాడు. అన్నదాతకు అష్టదిక్కులుగా సమస్యలు ఎదురై సమ్మెట పోటు లాంటి దెబ్బలు తగులుతున్న తన స్వేద సేద్యాన్ని మాత్రం నాటి నుంచి నేటికీ మరువలేదు. హాలికులు హలంను అమృతంగా మార్చి అందిస్తున్న అన్నదాత. ఎందుకో రేయింబవల్ల కష్టానికి నేడు నష్టాలుగా మిగిలిపోతుంది. అన్నదాతల ఆవేదన అరణ్య రోదన అవుతున్నది. ఆదుకునే ఆపద్బాంధవులే నేడు కరువై కనబడుతున్న పరిస్థితులే అగుపిస్తున్నాయి. ఆ చెమట చుక్కలు మౌనంగా రోదిస్తున్నాయి. కూడు అందించుటలో కమిలుతున్న చేతులు ప్రజల కడుపు నింపుతూ తన కడుపును కఠినంగా మార్చుకుంటున్నాయేమో! దేశానికి అన్నం పెడుతూ తాను పస్తులు ఉంటున్నాడేమో. అన్న విధంగా అన్నదాత పరిస్థితి తయారయింది. ఈ దేశ చరిత్రలో రైతన్నది చెరగని ముద్ర మాసిపోని సంతకం మట్టి వాసనల పరిమళం మల్లెల కంటే గొప్ప సుగంధలను అందించే సమర సాగుదారుడు. అటువంటి అన్నదాత ఎనలేని కష్టాలను ఎదురుకుంటున్నాడు. ఈ క్రమంలోనే అంత గొప్ప రైతుకు పెద్ద కష్టమొచ్చింది. పేరుకే అన్నదాత అంతా ఆవేదనే. గొప్ప చరిత్ర ఉన్న అన్నదాతకు ఆదివారం బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామంలో దాదాపుగా 60 70 ఎకరాల జొన్న మొక్కజొన్న పంటలు అగ్నికి ఆహుతి అయి అంతులేని ఆవేదనను అన్నదాతలకు మిగిల్చింది





అనడంలో సందేహమే లేదు. కొన్ని కోట్ల నష్టం ఏర్పర్చి కోలుకోలేని దెబ్బను మిగిల్చింది. ఆరుగాలం కష్టించి శ్రమను నమ్ముకొని రాత్రి పగలు తేడా లేకుండా కష్టపడి పండించిన పంట చేతికొచ్చి కోత కోసే సమయానికి బుగ్గిపాలవడంతో ఆ గ్రామ రైతుల మనస్సులలో ఒక చెరగని ముద్రను వేయడమే కాకుండా అంతులేని ఆవేదనతో పాటు విషాదాన్ని మిగిల్చింది అనడంలో సందేహం లేదు. అటువంటి అన్న దాతకు అండగా ప్రభుత్వం నిలవలసిన సమయం ఆసన్నమైంది. వారికి మనో ధైర్యాన్ని ఇస్తూ ఆర్థిక అండను కల్పించాల్సిన బాధ్యత ప్రజా ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. వీరి కష్టనష్టాన్ని అర్థం చేసుకొని పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలి. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ముందు జాగ్రత్త చర్యలుగా వీలైనంత తొందరలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి వచ్చిన పంటను వచ్చినట్లుగా కొనుగోలు చేపట్టినట్లయితే కొంతవరకైనా అన్నదాతలకు మేలు జరుగుతుంది. ఏదేమైనా అన్నదాతలకు అండగా నిలువ వలసిన సమయం ఆసన్నం మాత్రం అయింది. అన్నదాతల సమస్యల సాధనలో ప్రభుత్వాలు కృషి చేయవలసిన అవసరం భవిష్యత్తులో ఎంతో ఉంది. పరిష్కార మార్గాల వైపు ప్రభుత్వాలు మరింతగా కృషి జరగాలి.

## కోతుల సమస్యల తీర్చిన గోసంపల్లి సర్పంచ్ కొక్కుల సుభద్ర

ఖానాపూర్, మే 3 ( ప్రజా జ్యోతి ) : ఖానాపూర్ మండలంలో ఏ గ్రామంలో చుసిన కోతుల సమస్య... ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది.. ప్రజా ప్రతినిధులకు సవాల్ అయింది. సర్పంచ్ లే ఎలుగుబంటి వేషం వేసి కోతులను తరిమివేయటం.. చివరకు వాటిని పట్టుకొని దూరంగా వదిలేసే ప్రయత్నం చేస్తున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని గోసంపల్లె గ్రామంలో సర్పంచ్ కొక్కుల సుభద్ర ఆధ్వర్యంలో ఎలుగుబంటి వేసం వేసి కోతులను తారీమేసారు. కాని మళ్ళీ అవి తిరిగి ఊర్లోకి రావటంతో, ఇలా కాదనుకొని, వాటిని పట్టే ప్రయత్నం చేశారు. కోతులను పట్టే వారిని పిలిపించారు. తన స్వంత ఖర్చులతో ఆంధ్రప్రదేశ్ నెల్లూరు నుండి స్పెషల్ టీమ్ పిలిపించారు. వారి ద్వారా కోతులను పట్టారు. ఒక ప్రత్యేక బోను ను ఏర్పాటు చేశారు. అందులో కోతులు వచ్చే విదంగా వల ఏర్పాటు చేశారు. ఇంకేం కోతులు ఉన్న చోట బోను పెట్టి వాటిని బందించారు. అనంతరం వాటిని అడవిలో సురక్షిత మైన ప్రదేశంలో వదిలేసారు. దీనితో ఆ గ్రామంలో కోతుల సమస్యకు పరిష్కారం



అయింది. కోతుల వలన తాము తీవ్ర ఇబ్బందులు పడ్డామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు తమకు కోతుల బెడదా తప్పిందని, సర్పంచ్ కి ఆ గ్రామవాసులు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాలేరి విలాస్, నాయకులు కొక్కుల శేఖర్, కుమార్, నరసరాజు, వెంకటేష్, నాగరాజు, లక్ష్మి వార్డ్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## పోలీస్--పత్రిక ప్రతి నిధుల బృందం ఆధ్వర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న కాగజ్ నగర్ రూరల్ సీఐ కుమారస్వామి**





**మే 3, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జక వర్గంలోని పెంచికల పేట మండలం అగర్ గూడ గ్రామంలో పోలీ స్ శాఖ, పత్రిక ప్రతి నిధుల బృందం ఆధ్వ ర్యంలో ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ మ్యాచ్‌కు కాగజనగర్ రూరల్ సీఐ కుమార స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మీడియా బృందం తో కలిసి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా ప్రింట్ మీడియా ప్రతినిధులు,సిఐ కుమార స్వామి మాట్లాడుతూ... పోలీస్--ప్రజల మధ్య స్నేహపూర్వక వాతావర ణం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడ తాయని అన్నారు. క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా పరస్పర ఐక్యతను పెంచుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ కుమార్, పాత్రికేయ మీడియా జర్నలిస్టులు, గ్రామ సర్పంచులు, స్థానిక నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొని మ్యాచ్ ను ఆసక్తిగా వీక్షించారు. క్రీడాకారులు ఉత్సాహంగా ఆడుతూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

## అకస్మాత్తుగా గుండె పోటుతో మృతి చెందిన సీనియర్ కార్యకర్త మేకల నజీర్

**పార్థివ దేహానికి నివాళులు అర్పించి ప్రగాఢ సానుభూతి తెలిపి ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులను ఓదార్చిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప:**



**మే 3, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)నియో జకవర్గంలోని పెంచికల్పేట్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త మేకల నజీర్ గుండెపోటు తో ఈరోజు అకస్మాత్తుగా మృతి చెందిన విషయం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ దుర్వార్త తెలుసుకున్న సిర్పూర్ (టి)మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వెంటనే గ్రామానికి చేరుకుని నజీర్ పార్థివ దేహానికి ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు కోనేరు కోనప్ప మాట్లాడుతూ, నజీర్ పార్టీకి, ప్రజలకు నిస్వార్థ సేవలందించి అంకితభావం తన కర్తవ్యాన్ని నిర్వహించి పార్టీ బలుపేతానికి కృషి చేశారనిఅన్నారు. ఇలాంటి మంచి నాయకున్ని కోల్పో వడం బాధాకరమని అన్నారు. నిస్వార్థంగా అంకిత భావం కలిగిన నాయకుని సేవలు ఎల్లప్పుడూ గుర్తుండి పోతాయని పేర్కొన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యంగా ఉండాలని సూచించారు. అండగా ఉంటామని ధైర్యం కల్పించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిట్లోనే సేవలు

## ఇక నుండి డివిజన్ స్థాయిలో 'ప్రజావాణి' కార్యక్రమాలు ప్రారంభం

### జిల్లాకొత్త కలెక్టర్ భవేశ్ మిశ్రా వెల్లడి



**ఖానాపూర్ మే 3 (ప్రజా జ్యోతి )** ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ప్రజావాణి' కార్యక్రమాన్ని ఇకపై డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించనున్నట్లు ఆదివారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఒక ప్రకటన లో తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నుండి నిర్మల్ ఆర్డీఓ కార్యాలయం, భైంసా సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని వెల్లడించారు. కలెక్టరేట్‌లో ఇప్పటికే నిర్వహిస్తున్న ప్రజావాణితో పాటు, ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. డివిజన్ స్థాయి అధికారులు హాజరై ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా కేంద్రానికి రాలేని మారుమూల గ్రామాల ప్రజలు తమ సమస్యలను స్థానికంగానే విన్నవించుకునే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. భూ భారతి, భూ వివాదాలు, విద్యా, వైద్యం, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇతర పౌర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు లిఖితపూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు. అందిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు. డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రకటనలో కోరారు. కొత్త కలెక్టర్ కొత్త మార్పుతో చేపట్టనున్నా డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు పల్లె ప్రజలకు ఎంతో మేలు కలగజేయనున్నా యి. నిర్మల్ జిల్లా కేంద్రంలోని నిర్మల్ ఆర్డీవో కార్యాలయం తో పాటు కలెక్టరేట్ లో ప్రజావాణి జరుగుతున్న కొత్త కలెక్టర్ కార్యాలయం ప్రజలకు చేరువలో కాకుండా నిర్మల్ జిల్లాకేంద్ర పట్టణ వాసులకు సైతం కలెక్టర్ కార్యాలయం చేరుకోవాలంటే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు ఇక సామాన్య ప్రజలు అయితే ఎల్లంపల్లి రూట్ కలెక్టర్ చౌరస్తాలో దిగి ఆఫీస్ చేరుకోవడానికి సరైన వాహన సదుపాయాలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు ఈ ప్రజావాణి వల్ల నిర్మల్ చుట్టుపక్కల పల్లె వాసులు సైతం నిర్మల్ జిల్లా కేంద్రానికి చేరుకొని ఆర్డిఓ ఆఫీస్ లో ఫిర్యాదులు చేయడం సులభతరం అవుతుంది కలెక్టర్ మార్పు ప్రజలకు మేలు చేస్తున్న కొత్త కలెక్టరేట్ కార్యాలయం నిర్మల్ పట్టణ ప్రాంతంలో కాకుండా సుధీర ప్రాంతంలో నిర్మించడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నది మాత్రం నిజం. కలెక్టరేట్ కార్యాలయాన్ని మార్చాలని ఇటీవల సీఎం కార్యక్రమంలో తేల్చి చెప్పిన స్థానిక ఎమ్మెల్యే బీజేపీ ప్రతిపక్ష అసెంబ్లీ నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఈ కార్యాలయాన్ని ఏదేని విశ్వవిద్యాలయం లేదా ఇతరత్రా వాటికి వినియోగించుకోవాలని మహేశ్వర్ రెడ్డి సీఎం సభలో విజ్ఞప్తి చేశారు నిర్మల్ జిల్లాలోని పలు మండల గ్రామాల వాసులతో పాటు నిర్మల్ జిల్లా కేంద్ర పట్టణవాసులు సైతం ఈ డిమాండ్ ను సమర్థిస్తున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు

## వరుడికి నోట్ల దండా... వధు వుకి దత్తన్న కానుక

**అభిమానం చాటుకున్న గ్రామ స్తులు**



**సిరికొండ, మే 3 (ప్రజా జ్యోతి)**వివాహ వేడుకలకు హాజరై వ రుడికి నోట్ల దండ, వధువుకి దత్తన్న కానుక కింద ఆర్థిక సహాయం అందజేసి గ్రామ స్తులు ఒక నూతన ఒరవడి తోపాటు అభిమానాన్ని చా టుకున్నారు. సాధారణంగా ఒక వివాహానికి హాజరైతే ప్రత్యేక బహుమతులు (గిఫ్ట లు) అందజేస్తున్న ఈ సమ యంలో ఆ గిఫ్ట్ లను పక్కన పెట్టి వివాహానికి అయ్యే ఖర్చు లో తమ బాగ స్వామ్యం క ల్పించి కుటుంబంకు ఆర్థిక కాకుండా తోచినంత ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని సంకల్పించి గ్రామ స్తులు ఈ నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఆదివారం సిరికొండ మండల కేంద్రంలో ఓ సీనియర్ పాత్రికేయుడు ఎండి రసూల్ పాషా, ఆయన సోదరి ల వివాహం ఒకే సారి జరిగింది. ఈ వివాహానికి వివాహానికి గ్రామంలోని పెద్ద లతోపాటు పెద్ద మొత్తంలో గ్రామస్తులు హాజరయ్యారు. అన్నా,చెల్లెల వివాహాన్ని ఘనంగా జరిపించారు. రెండు పె ళ్లిళ్లు జరగడం వల్ల అధిక ఆర్థిక భారం కాకుండా గ్రామస్తు లు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఒకే కుటుంబానికి చెందిన వరుడికి దాదాపు 20వేల రూపాయల వరకు నోట్లదండను తయారుచేసి మెడలో వేశారు. వధువుకి ఆ గ్రామ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి కొత్తగా ప్రారంభించిన దత్తన్న కానుక ఆర్థిక సహాయం కింద రూ 5 వేలు నగదు అందజేశా రు. ఎండి రసూల్ పాషా పత్రి కా పరంగా ఒక పాత్రికేయుడి గా గ్రామస్తులకు అన్ని విధా లుగా అందుబాటులో ఉంటూ సహాయ సహకారాలు అందిం చడం వల్ల పెద్ద ఎత్తున గ్రామ స్తులు, బంధువులు, మిత్రు లు, అభిమానులు, హాజరై వి వాహాన్ని ఘనంగా జరిపారు. అన్నా చెల్లెళ్ల కు వివాహ శు భాకాంక్షలు తెలిపేందుకు పో టీ పడ్డారు. రెండు జంటలకు గ్రామస్తులు అండగా నిలిచి వివాహ శుభాకాంక్షలు తెలి యజేశారు. నోట్ల దండ సమ ర్పించి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టడం వల్ల గ్రామస్తులు ఆ శ్చర్య వ్యక్తం చేశారు.

## ప్రజల సహకారం తోనే స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే విజయవంతం అవుతుంది

**మున్సిపల్ వైస్ చైర్మన్ సోయాబ్ హుస్సేన్**



**ఖానాపూర్, మే 3 ( ప్రజా జ్యోతి )** ప్రజల సహకారం ఉంటేనే స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే కార్యక్రమం విజయవంతమవుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ సోయాబ్ హుస్సేన్ అన్నారు ఖానాపూర్ పట్టణంలోని 6వ వార్డులో స్వచ్ఛతే సేవ అనే లక్ష్యంతో మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26 కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహనా కల్పించారు. మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ షోయబ్ హుస్సేన్ మాట్లాడుతూ, పట్టణ అభివృద్ధికి పరిశుభ్రత మొదటి అడుగు, ప్రతి ఇంటి వద్ద చెత్తను తడి పొడి చెత్తను వేరు చేయడం, రోడ్లపై చెత్త వేయకుండా ఉండటం, డ్రైనేజ్ వ్యవస్థను కాపాడుకోవడం వంటి అంశాలను ప్రజలకు తెలియజేసారు. స్వచ్ఛ సర్వేక్షణలో మంచి ర్యాంక్ సాధించాలంటే ప్రజల సహకారం అత్యంత కీలకం అని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితేనే ఖానాపూర్ ఆదర్శ పట్టణంగా మారుతుందని అన్నారు. వార్డు పరిధిలో శుభ్రత కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు, ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమం లో మున్సిపల్ సిబ్బంది వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు

## రాజురలో విద్యుత్ మంటలకు మక్క పంట దగ్ధం



**ఖానాపూర్, మే 3 ( ప్రజా జ్యోతి )** ఖానాపూర్ మండలంలోని రాజురా గ్రామ సమీపంలో మొక్కజొన్న పంట కు ట్రాన్స్ఫారం నుండి వెలువడిన మంటలకు నిప్పంటుకొని కాలిబుదిదైంది. ఆదివారం ఏనుగుందుల చిన చిన్నయ్య అనే రైతు కు చెందిన అర ఎకరం పంట పూర్తిగా అగ్నికి ఆహుతి అయింది. తన పంట చేనులో ఉన్న ట్రాన్స్ఫర్మార్ నుండి మంటలు వచ్చి అక్కడే కోసి కుప్ప వేసిన మక్క కు నిప్పు అంటుంకుందని రైతు తెలిపారు దీనితో చుట్టూ పక్కల రైతులు గమనించి వెంటనే మంటలు అర్పే ప్రయత్నం చేశారు. మంటలు కంట్రోల్ కావటంతో పెద్ద ప్రమాదం జరుగకుండా ముప్పు తప్పిందని రైతులు తెలిపారు. ఎకరంలో వేసిన మక్క పంట అర ఎకరం కాలిపోయిందని, దాదా పు 50 వేల రూపాయలకు పైగా నష్టం జరిగిందని రైతు విలపి స్తూ తెలిపాడు. ప్రభుత్వం ఆదుకోవాలనిరైతులు కోరుతున్నారు.

# ఆదిలాబాద్ సిసిఐ పునః ప్రారంభం పై ఎంపీ, ఎమ్మెల్యే లు స్పష్టత వెల్లడించాలి

**మాజీ మంత్రి జోగు రామన్న**



**ఆదిలాబాద్ బ్యూరో,మే 3, (ప్రజా జ్యోతి)** గత కొన్ని సంవత్సరాలుగా మూసి ఉన్న ఆదిలాబాద్ సి మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) పరిశ్రమ పునః ప్రారంభం పై ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టతను ఇవ్వాలని మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న డిమాండ్ చేశారు.ఆదిలాబాద్ అభివృద్ధి వెనకాల అసలు రహస్యం ఏమిటి అనే అంశంపై పట్టణంలోని యాదవ సంఘం భవనంలో ఆదివారం "సీసీ పరిశ్రమ కొత్త పరిణామాలు -- మన కర్తవ్యం" అనే చర్చా వేదికను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జోగు రామన్న ముఖ్య అతిథిగా హాజరై తన అభిప్రాయాలను వెల్లడిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీసీఐ భూని ర్వాసితులకు న్యాయం చేస్తూ సీసీ పరిశ్రమల పునః ప్రారంభం పై స్పష్టమైన ప్రకటనను ఎంపీ, ఎమ్మెల్యేలు మీడియా ముఖంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ పున రుద్ధరణతో యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు అనేక కుటుంబాలు జీ వనోపాధి పొందుతాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరి శ్రమను తుక్కు కింద అమ్మే ప్రయత్నాలు చేస్తే ఎట్టి పరిస్థి తుల్లోనూ సహించబోమని హె చ్చరించారు. అవసరమైతే భూ నిర్వాసి తులతో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడి చేస్తామని తెలిపారు. అలాగే మున్సిపాలిటీకి సంబంధించిన రూ.5 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉండటంపై ప్రశ్నించారు. సమస్యలు పరి ష్కరించకపోతే మున్సిపల్ కార్యాల యం ఎదుటధర్నా కార్యక్రమం చేపడతామని చెప్పారు. ఈ చర్చా వేదికలో విజ్జగిరి నారాయణ (సీసీఐ సాధన కమిటీ కో-కన్వీనర్), కో-కన్వీనర్లు కొండ రమేష్, బండి దత్తాత్రి, మునిగేల నర్సింగ్, అరుణ్ కుమార్, బీడి చారి (కాంగ్రెస్),లంక రాఘవులు కిరణ్ (సీపీఎం), అరుణ్ కుమార్ (సీపీఐ), రత్నపురి రమేష్ (బీఎస్పీ), వెంకట్ నారాయణ (న్యూ డెమోక్రసీ), రైతు సంఘం నాయకులు లోకారి పోశెట్టి, మెట్టు ప్రహ్లాద్, భూ నిర్వాసితులు అరుణ్, కస్తాల ప్రేమల, బొల్లు ఈశ్వర్, ఉజిగిరి విట్టల్, యువజన సంఘం సభ్యులు ఎర్రం నర్సింగ్, బుట్టి శివా, న వతె శ్రీనివాస్ తదితరులు సు మారు 60 మంది పాల్గొన్నారు.

## నేడు కను గుట్ట కు రాష్ట్ర సీడ్ కార్పోరేషన్ చైర్మన్ రాక

**ఆదిలాబాద్ బ్యూరో,మే 3, (ప్రజా జ్యోతి)** నేడు బోథ్ మండలం కన్గుట్ట గ్రామానికి రాష్ట్ర సీడ్ కార్పొరే షన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి ఉ డీ సీసీ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ లు రానున్నారు. బోథ్ మండలం కన్గుట్ట గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తూ దగ్ధమైన మొక్కజొన్న జొన్న పంటను పరిశీలించడానికి తెలం గాణ రాష్ట్ర సీడ్ డెవల ప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, అలాగే ఆది లాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డా. నరేష్ జాదవ్ నేడు ఉదయం 09:00 గంటలకు రానున్నారు.

# మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు మండల కార్యకర్తలతో కలిసి

**సర్పంచ్ దుర్గం సరోజ, తిరుపతి ఆధ్వర్యంలో బెజ్జూర్ వారసంతలో అంబలి పంపిణీ**




**మే 3, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నియో జకవర్గంలోని బెజ్జూర్ మండలంలోని అంగడి బజారులో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాల మేరకు కార్యకర్తలు పుల్లూరు, అమీరుద్దీన్, సతీష్, కొండ్ర నరేందర్ గౌడ్, జంగిడి మల్లేష్, వార్డ్ సభ్యులు రాజన్న,రాముడు గుల రమేష్ నాతో కలిసి సర్పంచ్ దుర్గం సరోజ, తిరుపతి ఆధ్వర్యంలో బెజ్జూర్ వారసంతలో అంబలి పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గం సరోజ, తిరుపతి మాట్లాడుతూ... ఎండ తీవ్రత ను దృష్టిలో ఉంచు కొని బెజ్జూర్ మండలం లోని వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలు, వ్యాపారస్తులను దృష్టిలో ఉంచుకోండి ఎండ తీవ్రతను ఎండ తీవ్రత నుండి ఉపశమనం పొందుట కొరకు వడదెబ్బ తగల కుండా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడానికి వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారి శరీరానికి ఎండ ప్రభావం తగల కుండా చల్లదనంఅందించే దేశంతో ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం కొరకు అంబలి పంపిణీ చేస్తున్నా మని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబలిని స్వీకరించారు. ప్రజా సేవేత్తమ ప్రధాన న్యాయమని వేసవి కాలం లో ప్రజలకు ఉపశమనం కలిగించే విధంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తు న్నట్లుతెలిపారు.ఈ అంబలి పంపిణీ కార్యక్ర మాన్ని మరింత విస్తృతంగా నిర్వహిస్తా మని అన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగా అంబలి పంపిణీలో భాగంగా ప్రస్తుత ఈ వేసవి ని కాలంలో ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సిర్పూర్ (టి) నియోజక వర్గంలోని అన్ని మండలాల్లో కోనేరు కోనప్ప అంబలి పంపిణీ చేస్తున్నట్లు దుర్గం సరోజ, తిరుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జల్ జంగల్ జమీన్ పోరాట యోధునికి నివాళులు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మకరందు



**కెరమెరి మే 3(ప్రజా జ్యోతి** ఆదివాసీల ఆరాధ్య దైవం జల్ జంగల్ జమీన్ కొరకు పోరాట యోధుడికి ఆదివారం కేరమేరి మండలం జోడెంఘాట్‌కు సందర్శించి అమర వీరుడు కొమురం భీమ్ గారి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి మ్యూజియాన్ని సందర్శించి, ప్రాంతీయ చరిత్ర మరియు గిరిజనుల పోరాట గాథలపై వివరాలు తెలుసుకున్నారు

# ఆదిలాబాద్ సిసిఐ పునః ప్రా రంభం పై ఎంపీ, ఎమ్మెల్యే లు స్పష్టత వెల్లడించాలి





-మొదటిపేజీ తరువాయి

యాదవ సంఘం భవనంలో ఆదివారం "సీసీ పరిశ్రమ కొత్త పరిణామాలు -- మన కర్త వ్యం" అనే చర్చా వేదికను ఏ ర్పాటు చేశారు. ఈ కార్యక్రమా నికి మాజీ మంత్రి జోగు రామ న్న ముఖ్య అతిథిగా హాజరై తన అభిప్రాయాలను వెల్లడిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీసీఐ భూ ని ర్వాసితులకు న్యాయం చేస్తూ సీసీ పరిశ్రమల పునః ప్రారం భం పై స్పష్టమైన ప్రకటనను ఎంపీ, ఎమ్మెల్యేలు మీడియా ముఖంగా వెల్లడించాలని డి మాండ్ చేశారు. పరిశ్రమ పున రుద్ధరణతో యువతకు ఉపా ధి అవకాశాలు లభించడంతో పాటు అనేక కుటుంబాలు జీ వనోపాధి పొందుతాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పరి శ్రమను తుక్కు కింద అమ్మే ప్రయత్నాలు చేస్తే ఎట్టి పరిస్థి తుల్లోనూ సహించబోమని హె చ్చరించారు. అవసరమైతే భూ నిర్వాసి తులతో కలిసి ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్లను ము ట్టడి చేస్తామని తెలిపారు. అలాగే మున్సిపాలిటీకి సం బంధించిన రూ.5 కోట్ల నిధు లు పెండింగ్‌లో ఉండటంపై ప్రశ్నించారు. సమస్యలు పరి ష్కరించకపోతే మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపడతామని చెప్పారు.ఈ చర్చా వేదికలో విజ్జగిరి నారాయణ (సీసీఐ సాధన కమిటీ కో-కన్వీనర్), కో-కన్వీనర్లు కొండ రమేష్, బండి దత్తాత్రి, మునిగేల నర్సింగ్, అరుణ్ కుమార్, బీడి చారి (కాంగ్రెస్), లంక రాఘవులు, కిరణ్ (సీపీఎం), అరుణ్ కుమార్ (సీపీఐ), రత్నపురి రమేష్ (బీఎస్పీ), వెంకట్ నారాయణ (న్యూ డెమోక్రసీ), రైతు సంఘం నా యకులు లోకారి పోశెట్టి, మె ట్టు ప్రహ్లాద్, భూ నిర్వాసితు లు అరుణ్, కస్తాల ప్రేమల, బొల్లు ఈశ్వర్, ఉజిగిరి విట్టల్, యువజన సంఘం సభ్యులు ఎర్రం నర్సింగ్, బుట్టి శివా, న వతె శ్రీనివాస్ తదితరులు సు మారు 60 మంది పాల్గొన్నా రు.